క్లుప్తంగా

డ్రాపౌట్స్‌కు రీ అడ్మిషన్లు

వడమాలపేట: ఇంటర్ చదువుతూ మధ్యలో ఆపేసిన విద్యార్థులను మళ్లీ కళాశాలలో రీ అడ్మిషన్లు ఇస్తున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏ గ్రూప్ అయినా చదువుతూ మధ్యలో నిలిపి వేసిన విద్యార్థులకు ప్రభుత్వం సార్వత్రిక విధానం ద్వారా ఇంటర్‌లో చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్ అయిన విద్యార్థులకు ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పెట్రోల్ బంక్‌లో వసతులపై తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దార్

నగరి: స్థానిక పెట్రోల్ బంకుల్లో వసతులపై తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తనిఖీలు చేశారు. పెట్రోలు పరిమాణం, డెన్సిటీ పరీక్షలు, లిట్మస్ టెస్టు, తాగునీరు, గాలి, వసతి, బాత్రూమ్ వసతులను పరిశీలించారు. బాత్రూమ్‌ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. తప్పనిసరిగా తాగునీటి వసతి, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు ఉండాలన్నారు. వీటిలో ఏవి లేకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓం శక్తి ఆలయంలో పూజలు

నిండ్ర: మండల కేంద్రమైన నిండ్రలో ఉన్న ఓం శక్తి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం మహిళలు కర్పూర హరతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా కుంభాభిషేకం



కల్యాణం చేస్తున్న వేదపండితులు

పుత్తూరు రూరల్: స్థానిక గేట్‌పుత్తూరులోని దాసరిగుంట వీధిలో నూతనంగా నిర్మించిన సీతారామ భజన మందిరానికి శుక్రవారం వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. సీతారాముల చిత్ర పటాలను ప్రతిష్ఠించారు. సాయంత్రం సీతారామ కల్యాణోత్సవం కనుల పండుగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు మునియప్పమొదలియార్, రమేష్ పురోహితులు పాల్గొన్నారు.


కన్నాయిరంనకు సన్మానం



కన్నాయిరంను సత్కరించి స్వీట్లు తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నగరి: వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల్లో చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సత్రవాడకు చెందిన ఈవీ కన్నాయిరంను వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. నేతలు ఆయన నివాసానికి వెళ్లి, శాలువ కప్పి, సత్కరించి స్వీట్లు తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నాయిరం మాట్లాడుతూ తనకు పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రికి, సహకరించిన పర్యాటక శాఖ మంత్రి ఆ ర్కే రోజాకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నా రు. నాయకులు మురుగ, వేలు, అన్బు, నాగరాజ్, ఆరుముగం, రవికుమార్, మురుగన్, గో విందరాజులు, మునికృష్ణయ్య, పీకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తగా నాగరాజరెడ్డి



గంగాధరనెల్లూరు: మండలంలోని ప్రసన్నపార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా వింజం లక్ష్మిరెడ్డిపల్లికు చెందిన నాగరాజరెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీఎల్‌ఆర్‌పల్లె, పాతూరునత్తం, వేట్కూరుపల్లి, కన్నికాపురం గ్రామాలకు చెందిన పెనుగొండ రెడ్లు ఈ ఎన్నికలో పాల్గొన్నారు. నాగరాజరెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు పుత్తూరు మార్కెట్ వేలం

పుత్తూరు రూరల్: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతువధశాలకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేవీఎన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో హక్కులు దక్కించుకున్న వారు పురపాలక సంఘం నిబంధనలకు లోబడి రుసుములు వసూలు చేయాల్సి ఉంటుందన్నారు.

మామిడి రైతుల సమావేశం నేడు

గంగాధరనెల్లూరు: మండలంలోని గొల్లపల్లె సమీపంలోని జైన్ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు మామిడి రైతుల సమావేశం నిర్వహిస్తామని ఫ్యాక్టరీ మేనేజర్ షమీర్‌శర్మ తెలిపారు. ఈ సమావేశానికి హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్ పాల్గొని రైతులకు సలహాలు, సూచనలిస్తారని చెప్పారు. రైతులు పాల్గొని సమస్యల్ని నివృత్తి చేసుకోవాలని కోరారు.

కాలువ జాగా.. పచ్చ పాగా



కాలువ పోరంబోకులో ఏర్పాటు చేసుకున్న రోడ్డు





ఇరిగేషన్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. అది ఎలాంటిదైనా తమ ఖాతాలో వేసుకుంటున్నారు పచ్చనేతలు. చెరువులు పోయే..దొరువులు పోయే.. చివరకు కాలువల భూమినీ వదలడం లేదు టీడీపీ నాయకులు. ముడిపల్లె రామాపురంలో ఇలాంటి భూమినే తెలుగు తమ్ముళ్లు కబ్జా చేశారు. ఆ ఆక్రమణలు తొలగించాలని ఆ ప్రాంతంలోని రైతులు శుక్రవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు.

- 3.5 ఎకరాల మేరకు కబ్జా చేసిన టీడీపీ నాయకులు
- ఆక్రమణలు తొలగించాలని ఇరిగేషన్ ఏఈకి వినతిపత్రం

నగరి: మండలంలోని ముడిపల్లె రామాపురంలో పచ్చనేతలు కాలువ పోరంబోకు ఆక్రమించుకుని యథేచ్ఛగా అనుభవిస్తుండడంపై రైతులు మండిపడుతున్నారు. భయం గుప్పిట్లో ఇన్నాళ్లు గడిపిన సమీప రైతులు ప్రస్తుత ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందన్న నమ్మకంతో అధికారుల ముందుకు వచ్చారు. గతంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన వీరు, మళ్లీ ఆక్రమణల తొలగింపు అంశంపై శుక్రవారం ఇరిగేషన్ ఏఈ రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అందులో పేర్కొన్న మేరకు ముడిపల్లె పంచాయతీ రామాపురంలో వ్యవసాయ పొలాల మధ్యలో కొండ నీటి పారుదల కాలువ ఆక్రమణకు లోనైందన్నారు.

రెవెన్యూ రికార్డుల్లో స ర్వే నంబర్ 150, 152లో ఉన్న ఈ కాలువ వెంగన్న కండ్రిగ శివారు ప్రాంతాల నుంచి ముడిపల్లె చెరువు వరకు రామాపురం పొలాల మీదుగా వెళుతుందన్నారు. కొండలపై నుంచి వచ్చే వర్షపు నీరు ఈ కాలువల్లో వెళ్లి చెరువుకు చేరుతుంది. ఈ కారణంగా చెరువులో నీరు నిండి వ్యవసాయ పనులకు ఉప యోగపడడమే కాక కాలువల్లో నీరు ప్రవహించే స మయంలో వ్యవసాయ పొలాల్లోని బావులు, బోర్ల లో నీటి మట్టం పెరిగేందుకు వీలుకలుగుతుంది. ఈ కాలువను టీడీపీ నాయకులు ఆర్.మునిరత్నం నా యుడు, గోపాల్‌నాయుడు, నీలకంఠం నాయుడు, మనోహర్ నాయుడు, ఆర్. వెంకటేశులు నాయుడు, ఇ. మునిరత్నం నాయుడు ఆక్రమించుకున్నారని ఏ కంగా కాలువకు అడ్డంగా గ్రావెల్ వేసి మూసేసారన్నారు. ఇలా చేయడంతో చెరువుకు నీరు వెళ్లడానికి మార్గం లేదని, రైతుల పొలాల్లోని బావులు, బోర్లలో నీటిమట్టం తగ్గిపోతుందన్నారు. ఆక్రమణలు తొలగించి సమీప రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు. అలాగే గుట్ట పోరంబోకులు, ఇతర ప్రభుత్వ ఆస్తులను కూడా అధికారులు ఒకసారి సర్వే చేసి ఆక్రమణలుంటే తొలగించాలని కోరారు.

నోటీసులు జారీ చేశాం



కాలువ పోరంబోకు ఆక్రమణలకు సంబంధించిన రైతులకు ఇదివరలో నోటీసులు జారీ చేశాం. ఆక్రమణలు తొలగించడానికి అయ్యే ఖర్చుల అంచనాను నిర్ధారించాలని ఇరిగేషన్ శాఖ వారికి లేఖ రాశాం. ఆక్రమణలను ఎట్టి పరిస్థితిలోను వదలిపెట్టం. తప్పక వాటిని స్వాధీనం చేసుకుని, కాలువ ఏర్పాటు చేస్తాం. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్, నగరి మండలం

ఆక్రమణలున్నట్లు గుర్తించాం



కాలువ పోరంబోకులో ఆక్రమణలున్నట్లు గుర్తించాం. తహసీల్దార్ నుంచి మాకు ఈ అంశంపై లేఖ కూడా వచ్చింది. వారు సర్వే చేసి ఆక్రమణకు లోనైన విస్తీర్ణం వివరాలు అందిస్తే దానికి తగిన విధంగా అంచనాలు సిద్ధం చేసుకుని ఆక్రమణలను తొలగిస్తాం.

– రాజగోపాల్ రెడ్డి, ఏఈ, ఇరిగేషన్ విభాగం

ఈ–క్రాప్ నమోదుతో రైతులకు భరోసా



ఈ - క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: రైతు తాము సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే అతనికి భరోసా లభిస్తుందని ఏఓ హేమలత తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆర్కేవీబీ పేట, గాజంకి, ఎర్రమరాజుపల్లె ఆర్బీకేల పరిధిలోని పంటలను సందర్శించి, ఈ–క్రాప్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతూ ఈ–క్రాప్ నమోదులో వారు సాగు చేస్తున్న పంటలు, సాగు చేస్తున్న పొలం సర్వే నంబర్‌ను సరి చూసుకోవాలని సూచించారు. రైతులకు పంట బీమా, పంట నష్ట పరిహారం, సున్నావడ్డీ, పంట రుణాలు సకాలంలో అందాలంటే ఈ–క్రాప్ నమోదు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అందిస్తున్న చేయూతను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణం పెంచుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయానిచ్చే వాణిజ్య పంటలైన కూరగాయలు, పూల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు గాయత్రి, హేమాద్రి పాల్గొన్నారు.

నేడు గృహ సారథులకు శిక్షణ

వెదురుకుప్పం: మండలంలోని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు శనివారం ఉదయం 10 గంటలకు వెదురుకుప్పంలో శిక్షణ తరగుతులు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.పద్మనాభ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరయ్యే శిక్షణ తరగతులకు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఆయా పంచాయతీల్లోని నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరయ్యేలా చూడాలన్నారు.

పాఠశాలల తనిఖీ



పాతవెంకటాపురంలో రికార్డుల్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రన్

గంగాధరనెల్లూరు: మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాతపాళెం ఎస్సీకాలనీ, అగ్రహారం ఎస్సీకాలనీ, కొత్తవెంకటాపురం, పాతవెంకటాపురం, పాతవెంకటాపురం ఎస్సీకాలనీ, ప్రాథమికపాఠశాలలు, గరిగలపల్లె ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి, రికార్డులు హాజరు పట్టికను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. విద్యలో వెనుకపడిన విద్యార్థుల్ని గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలన్నారు. అనంతరం ఎస్ఏ 1, ఎఫ్3 పరీక్షా పేపర్లను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ప్రశ్నలు వేసి, జవాబులు రాబట్టారు.

గన్నవరం ఘటనకు చంద్రబాబే సూత్రధారి

శ్రీరంగరాజపురం: గన్నవరం ఘటనకు చంద్రబాబే సూత్రధారి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అనంతరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు పథకం ప్రకారమే చంద్రబాబు నాయడు సూచనలు మేరకు పట్టాభి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అలజడులు సృష్టించి, పోలీసులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేయడమే చంద్రబాబు అజెండా అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు విజయబాబు, కోటిరెడ్డి బాబు పాల్గొన్నారు.

దళితులందరికీ పథకాలు అందేలా చూస్తాను



సురేంద్రనగరంలో సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఏఎంసీ వైస్ చైర్మన్

కార్వేటినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దళితులందరికీ అందేలా చూస్తానని ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం. గోపి అన్నారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి దళిత గ్రామాల్లో పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధే జగనన్న లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాలన్నీ మహిళల ఖాతాల్లో జమ చేసి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. దళిత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. వ్యవసాయ రంగంలో దళితులకు అండగా ఉంటానని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు మార్కెట్ వైస్ చైర్మన్‌గా ముందుంటానని పేర్కొన్నారు. అలాగే పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనను ఏఎంసీ వైస్ చైర్మన్ స్థాయికి చేర్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి నిత్యం రుణపడి ఉంటానని అన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

నిండ్ర: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీపీ దీప అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలన్నీ పూర్తి స్థాయిలో అర్హులందరికీ అందించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా పని చేయాలన్నారు. మండలంలో ప్రజాప్రతినిధులు కూడా అధికారులలతో కలిసి పని చేయాలని సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ వేణు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం తిరుమలరాజుపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజనంలో మార్పు తీసుకొచ్చిందన్నారు. వెజిటబుల్ రైస్, పులిహోరా, తీపి పొంగలి, ఉడికించిన గుడ్డు అందిస్తోందన్నారు. కూరగాయల ధరలు పెరగడంతో ఏజెన్సీలకు బిల్లులు పెంచారని చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

కార్వేటినగరం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఆర్కేవీబీ పేట సమీపంలోని ఇందిరా కాలనీ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆర్కేవీబీ పేట పంచాయతీ ఇందిరాకాలనీకి చెందిన ఎం.గంగాధరం రోడ్డుపై వెళ్లుతుండగా కార్వేటినగరం నుంచి పళ్లిపట్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొంది. దీంతో గంగాధరానికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

ఆక్వాతో యువతకు ఉపాధి



చేపలను పరిశీలిస్తున్న కృపాలక్ష్మి, లత

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ఆక్వాపై ప్రత్యేక దృష్టి సారించి, యువతకు ఉపాధి కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జగనన్న ఫిష్ మార్కెట్‌ను ఎంపీపీ లతతో కలసి కృపాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి పెద్దపీట వేయడమే కాకుండా మండల కేంద్రాల్లో జగనన్న ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తోందన్నారు. ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో సముద్రపు చేపలు సరసమైన ధరలకే అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ జగనన్న ఫిష్ మార్కెట్లకు ప్రభుత్వమే చేపలను పంపిణీ చేస్తోందని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల్లో ఉండే అన్ని రకాలైన చేపలను ప్రభుత్వమే కొనుగోలు చేసి, జగనన్న ఫిష్ మార్కెట్లోకి తరలించి, ఆక్వా రైతులను ఆదుకుంటోందని చెప్పారు. అనంతరం జగనన్న ఫిష్ మార్కెట్‌ను ప్రారంభించి, ప్రభుత్వం పంపిణీ చేసిన సముద్ర చేపలతో పాటు, రొయ్యలు, పీతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు మోహనకుమారి, కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు శేఖర్‌రాజు, చందురాజు, వెంకటరత్నం, ధనశేఖర్‌వర్మ, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, దాము, పురందర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల పనులు పరిశీలిస్తున్న విస్తరణాధికారి రమేష్

పాలసముద్రం: మండలంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని శ్రీబొమ్మరాజుపురంలో జరుగుతున్న గృహనిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తున్నా పనులు సక్రమంగా జరగడంలేదన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ అచ్చయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నగరి: మండలంలోని మాంగాడు, మేళపట్టు యూనిట్‌లోని గ్రామాల్లో వ్యవసాయ శాఖ తరఫున ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తనాల సాగు నేలతల్లి బాగు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ మంజుల మాట్లాడుతూ రైతులందరూ ఖరీఫ్ పంటకన్నా ముందు 32 రకాల విత్తనాలు విత్తుకుని 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నడంతో ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా అందుతుందన్నారు. భూమిలో జీవవైవిధ్యం ఏర్పడి, సేంద్రీయ కర్బనం స్థిరీకరించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు నీలకంఠరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



నుజ్జు నుజ్జయిన కారు, ద్విచక్రవాహనం

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన కార్వేటినగరం మండపం వీధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు .. కార్వేటినగరం పంచాయతీలోని పద్మసరస్సు ఎస్టీకాలనీకి చెందిన ఉదయకుమార్(27) కుటుంబసభ్యులతో కలసి సొంత పనుల నిమిత్తం కార్వేటినగరం గ్రామానికి చేరుకుని గాండ్లమిట్ట కూడలి వద్ద ద్విచక్రవాహనంపై నిలుచుని ఉండగా పచ్చికాపల్లం నుంచి చిప్స్ లోడ్డుతో వస్తున్న టిప్పర్ అతివేగంగా దూసుకొచ్చి ద్విచక్రవాహనాన్ని, ఆ పక్కనే ఉన్న రెండు కార్లను ఢీకొట్టాడు. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న సునీత(22)కు తీవ్ర గాయాలయ్యాయి. ఉదయ్‌కుమార్ టిప్పర్ ముందు చక్రంలో ఇరుక్కున్నాడు. అతడిని సుమారు 500 మీటర్ల దూరం వరకు టిప్పర్ లాక్కెళ్లింది. గ్రామస్తులు ఈ విషయం గుర్తించి, టిప్పర్‌ను ఆపినా డ్రైవర్ ఆపకుండా వెళ్లడంతో యువకులు ద్విచక్రవాహనంలో వెంబడించి అడ్డుకున్నారు. లారీ కింద ఉన్న ఉదయ్‌కుమార్ ప్రాణాలతో బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచార మందుకున్న ఎస్‌ఐ దస్తగిరి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. 108లో క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స.హ.చట్టం కార్యాలయం ప్రారంభం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఇన్బనాథన్

గంగాధరనెల్లూరు: నియోజకవర్గ కేంద్రమైన గంగాధరనెల్లూరులో సమాచార హక్కుచట్టం ఉప కార్యాలయాన్ని శుక్రవారం ఎస్‌ఐ. శ్రీనివాసరావు ప్రారంభించారు. తహసీల్దార్ ఇన్బనాథన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు స.హ. చట్టం సంఘం నాయకుల కృషి అభినందనీయమన్నారు. సామాన్యులు సైతం సమాచారం పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, జాతీయ సలహాదారుడు డాక్టర్ తిలక్, జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు కుమార్, మండల ఇన్‌చార్జి రాజేష్‌కుమార్, మండల అధ్యక్షుడు ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు నియంత్రణ కమిటీలు ఏర్పాటు



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

పుత్తూరు రూరల్: విద్యాలయాల్లో మాదకద్రవ్యాల ఊసే తలెత్తకుండా వాటి పూర్తిస్థాయి నిర్మూలించడానికి యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామని పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీవిద్య, హిమజా డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ విద్యాలయాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలను పూర్తిగా అరికట్టడానికి ఎస్‌ఈబీ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నిత్యం ఎస్‌ఈబీ అధికారులు రైడ్స్, పెట్రోలింగ్ చేస్తూ బయట వ్యక్తులు కళాశాల పరిసరాల్లో సంచరించకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకు అనుగుణంగా కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీల్లో కళాశాల ప్రిన్సిపల్ చైర్మన్‌గా ఎస్‌ఈబీ సీఐ కన్వీనర్‌గా, ఎంపిక చేసిన లెక్చరర్లు, విద్యార్థులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీవిద్యా కళాశాల చైర్మన్ ఉమామహేశ్వర్, ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఏ.నాగరాజు, హెచ్‌సీ కె.రవి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో నక్షత్ర వనం



నక్షత్రవనం ప్రారంభోత్సవంలో ప్రిన్సిపల్

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నక్షత్రవనాన్ని ప్రిన్సిపల్ వేణుగోపాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జీవన విధానం ప్రకృతితో ముడిపడి ఉందని, ప్రజల దైనందిన జీవితాన్ని పర్యావరణ అనుకూల ఆధారాలు, అలవాట్లతో ముడిపడి ఉండేటట్లు చేశారన్నారు. ఆరోగ్యం, పర్యావరణం విడదీయలేనివని, వీటిని దృష్టిలో ఉంచుకుని ఔషధ మొక్కలను కళాశాలలో నాటామన్నారు. 27 నక్షత్రాలకు సంబంధించి 27 మొక్కలను అధ్యాపకులు, విద్యార్థులు వారి నక్షత్రాలకు అనుగుణంగా నాటించామన్నారు. వృక్ష శాస్త్ర విభాగం అధిపతి ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ జ్యోతిష్య శాస్త్రంలో 27 నక్షత్రాలకు ప్రత్యేక దేవతలు, అధిదేవతలు ఉన్నట్లుగా వాటికి సంబంధించిన చెట్లు ఉన్నాయని, వీటిని పెంచడంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవడమేగాక పర్యావరణానికి కూడా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అరుణ కుమారి, భాస్కర రాజు, చిన్నపాపమ్మ, షర్మిల, పంకజ, సుహాసిని, సరిత, శివలక్ష్మి, మునికుమారి, నరసయ్య, మీనా పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరంలా మారిందని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. శుక్రవారం పీపీ పురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 32 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్న పిల్లలకు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. 108 డాక్టర్ గౌసు, నర్సు పూజిత, ఆశ కార్యకర్త అనిత, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ వీఆర్వో దౌర్జన్యం

- జగనన్న కాలనీకి వెళ్లే దారి ఆక్రమణ



దారికి అడ్డంగా వేసిన రాళ్లు

వెదురుకుప్పం: ఓ రిటైర్డ్ వీఆర్వో ఆక్రమణలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. ఏకంగా జగనన్న కాలనీకి వెళ్లే దారిని దౌర్జన్యంగా ఆక్రమించి, దారి లేకుండా చేశాడు. 15 రోజులుగా దారికి అడ్డంగా రాళ్ల తోలి, వెళ్లనీయకుండా అడ్డగిస్తున్నాడని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మారేపల్లె గ్రామానికి సమీపంలో పేదలందరికీ ఇళ్లు పథకంలో 12 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కాలనీకి వెళ్లేందుకు దారి సౌకర్యం ఏర్పరిచారు. అయితే ఆ దారిని రిటైర్డ్ వీఆర్వో టి. దేవరాజులురెడ్డి ఆక్రమించుకుని రోడ్డుకు అడ్డంగా రాళ్లు తోలి దారి లేకుండా అడ్డగిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నా డని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారి సక్రమంగా లేక అడ్డంకులు కలిగిస్తున్నారని సర్పంచ్ అన్బురాశి తెలిపారు.

సేంద్రియ సాగుకు ప్రాధాన్యమివ్వాలి



సేంద్రియ సాగును పరిశీలిస్తున్న వాసు

పాలసముద్రం: మండలంలోని రైతులు సేంద్రియ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. శుక్రవారం శ్రీకావేరి రాజుపురం రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు అధ్యక్షతన రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీపీఎం వాసు మాట్లాడుతూ సేంద్రియ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండడమే కాక, ఉత్పత్తులు విషతుల్యమైపోతున్నాయని చెప్పారు. విత్తనశుద్ధికి జీవామృతం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం, కషాయం వంటివి తయారు చేసి పంటలకు వినియోగించవచ్చన్నారు. అనంతరం సేంద్రియ సాగుపై సాగుచేసిన కూరగాయల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు వనజ, పాల్గొన్నారు.